కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ ఆఫ్ న్యూ భారత్

కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

సంపుటి - 01 | సంచిక -234 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | 04-09-2026 | శుక్రవారం | పేజీలు : 4

# 'బర్తరఫ్'పై కొండా ఫైర్!



- వివరణ లేకుండానే బర్తరఫ్ చేశారు
- నా వాదన ఒక్కసారి వినాలి
- మంత్రి పదవిపై నాకు బాధలేదు
- బర్తరఫ్ చేయడం జీర్ణించుకోలేకపోతున్నా
- కుమార్తె వ్యాఖ్యలకు నేనెలా బాధ్యురాలిని
- బీసీ మహిళను అవమానించారు
- రేవంత్ ఒక్కసారి ఆత్మపరిశీలన చేయాలి
- నియోజకవర్గంపై వివక్ష చూపించారు
- తదుపరి అడుగుపై ఇంకా నిర్ణయంలేదు

**న్యూస్ డెస్క్, 03 సెప్టెంబరు (బిఎన్ఎస్):** తెలంగాణ మంత్రివర్గం నుంచి తనను తొలగించడంపై కొండా సురేఖ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి పదవి పోయినందుకు తనకు ఏ మాత్రం బాధ లేదని పేర్కొన్న కొండా సురేఖ .. అయితే తన నుంచి ఎలాంటి వివరణ తీసుకోకుండా.. తనను ఎందుకు మంత్రి పదవి నుంచి తొలగిస్తున్నారనే కారణం చెప్పకుండా తనను బర్తరఫ్ చేయడాన్ని మాత్రం తాను అస్సలు జీర్ణించుకోలేకపోతున్నానని ఆమె వాపోయారు. తనను మంత్రి పదవిలో నుంచి తొలగించే ముందు కనీసం తన వాదన ఒక్కసారైనా వినాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ప్రస్తుతం మంత్రి పదవి నుంచి తొలగించిన తర్వాత పార్టీకి, ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేస్తారా అని అడిగిన ప్రశ్నకు ఆమె బదులిచ్చారు. తన నియోజకవర్గ ప్రజల కోసం మంత్రి పదవి లేకున్నా.. ఒక సాధారణ ఎమ్మెల్యేగా సేవలు అందిస్తానని చెప్పారు.

మిగతాది 2 లో..

# ఢిల్లీలో కొత్త పార్టీ ఆవిర్భావం!

- 'కాక్రోచ్ జనతా పార్టీ' ఏర్పాటు
- ఆప్‌పై మనీష్ బ్రహ్మభట్ ఫైర్
- వాలంటీర్లను విస్మరించారని విమర్శ
- కేజ్రీవాల్‌దే తెరవెనుక వ్యూహమని వ్యాఖ్య
- ఉద్యమకారుల కోసం ప్రత్యామ్నాయ వేదిక
- ప్రజాస్వామ్యమే లక్ష్యమన్న బ్రహ్మభట్




**న్యూస్ డెస్క్, 03 సెప్టెంబరు (బిఎన్ఎస్):** దేశ రాజధాని ఢిల్లీ వేదికగా 'కాక్రోచ్ జనతా పార్టీ డెమోక్రటిక్' ఆవిర్భవించింది. పార్టీ వ్యవస్థాపకుడు మనీష్ బ్రహ్మభట్ గురువారం ఈ కొత్త రాజకీయ వేదికను అధికారికంగా ప్రారంభించారు.

2 లో

# రూపాయి బలం.. డాలర్ డౌన్!



2 లో

**న్యూస్ డెస్క్, 03 సెప్టెంబరు (బిఎన్ఎస్):** అంతర్జాతీయ మార్కెట్‌లో సానుకూల పరిస్థితుల నేపథ్యంలో విదేశీ మారక ద్రవ్య మార్కెట్‌లో భారత రూపాయి బలంగా పుంజుకుంది. గురువారం ప్రారంభ ట్రేడింగ్‌లోనే అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి మారకం విలువ ఏకంగా 47 పైసలు పెరిగి 94.26 స్థాయికి చేరుకుంది.

# కేబినెట్‌లో రాజగోపాల్‌కు చాన్స్?

- 'ఇస్తే మంత్రి పదవి తీసుకుంటా'
- అధిష్టానం నిర్ణయంపై నో కామెంట్
- సోదరుడి పదవితోనే జాప్యమా?
- ఢిల్లీకి వెళ్లి పైరవీలు చేయను
- రేవంత్‌పై ఎప్పుడూ వ్యక్తిగత విమర్శలు లేవు
- సురేఖ ఎపిసోడ్‌తో పెరిగిన విస్తరణ చర్చ
- వెంకట్‌రెడ్డి స్థానంపై పొలిటికల్ గుసగుసలు




2 లో

**న్యూస్ డెస్క్, 03 సెప్టెంబరు (బిఎన్ఎస్):** కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తప్పించిన నేపథ్యంలో తనను కేబినెట్?లో తీసుకునే అంశంపై మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కొండా సురేఖ విషయంలో అధిష్టానం తీసుకున్న నిర్ణయంపై మేము ఏం మాట్లాడగలుగుతామన్నారు. కొండా సురేఖ మాట్లాడిన వాటిలో కొన్ని అంశాలు వాస్తవాలు, మరికొన్ని తప్పిదాలు ఉండవచ్చు కానీ హైకమాండ్ తీసుకున్న నిర్ణయంపై ఏం మాట్లాడలేమని చెప్పారు. తాజాగా ఓ యూట్యూబ్ చానల్?తో ఫోన్?లో మాట్లాడిన ఆయన.. ఈ వ్యాఖ్యలు చేశారు.

**ఇస్తే తీసుకుంటా:**

తనకు మంత్రి పదవిపై స్పందించిన రాజగోపాల్ రెడ్డి అధిష్టానం మంత్రి పదవి ఇస్తే తీసుకుంటానన్నారు.

# కొండా సురేఖకు కేఏ పాల్ ఆఫర్!



2 లో

- ప్రజాశాంతి పార్టీలోకి బహిరంగ ఆహ్వానం
- "వేరే పార్టీలోకి వెళ్లకండి" అంటూ సూచన
- బీసీ నేతలకు కాంగ్రెస్‌లో భద్రత లేదంటూ ఆరోపణ
- రెడ్డి నేతల పదవులకు ఢోకా లేదన్న కేఏ పాల్
- బీసీలకు న్యాయం చేసేది ప్రజాశాంతి పార్టీయే
- సురేఖకు పార్టీలో తగిన గౌరవం ఇస్తామంటూ హామీ
- కేఏ పాల్ వ్యాఖ్యలతో తెలంగాణలో హాట్ టాపిక్

# దేశభక్తిలో అసద్‌కు సాటి లేరు!




2 లో

- శభక్తిలో అసద్.. మోడీ, షాలకు తక్కువ కాదు
- పాతబస్తీ అభివృద్ధిపై అసద్‌తో చర్చించా
- స్టీల్ బ్రిడ్జికి గత ప్రభుత్వం నయా పైసా ఇవ్వలేదు
- పాతబస్తీ గల్లీల్లోకి వచ్చింది నేనే
- ఓల్డ్ సిటీ అభివృద్ధికి వెంటనే నిధులు
- పేదలకు ఇందిరమ్మ ఇళ్లు.. లక్ష ఇళ్ల లక్ష్యం

# రైతులకు సర్కార్ గుడ్‌న్యూస్!

- తులకు రూ.375 కోట్ల సాయం
- అమరావతికి 6,212 ఎకరాల భూసమీకరణ
- కొత్త రైల్వే లైన్‌కు కేబినెట్ ఓకే
- రూ.759.79 కోట్లతో అమరావతి సంగమం
- ఎల్పీఎస్ రోడ్లకు బీటీ రోడ్లు
- వరద నష్టం పనులకు రూ.6.25 కోట్లు
- వెలిగొండ పనులకు రూ.11.63 కోట్లు
- న్యాయ, వైద్య రంగాలకు బలోపేతం



**న్యూస్ డెస్క్, 03 సెప్టెంబరు (బిఎన్ఎస్):** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో రైతులు, అమరావతి రాజధాని అభివృద్ధి, రహదారులు, రైల్వే లైన్, వరద నష్టం పునరుద్ధరణ, వైద్య, న్యాయ రంగాలకు సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రైతులకు ఆర్థిక సహాయం అందించడంతో పాటు అమరావతి మౌలిక వసతుల అభివృద్ధికి అవసరమైన భూసమీకరణ ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. కేబినెట్ సమావేశం ముగిసిన తర్వాత మీడియాతో మాట్లాడిన మంత్రి పార్థసారథి.. కేబినెట్ నిర్ణయాలను వెల్లడించారు..

రైతులకు గుడ్ న్యూస్..

తోతాపురి మామిడి రైతులకు ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రైతులకు రూ.281 కోట్ల మద్దతు ధర నిధులు అందించాలని నిర్ణయించారు. మార్క్‌ఫెడ్ ద్వారా స్వల్పకాలిక రుణాలు అందించేందుకు కూడా కేబినెట్ అనుమతి ఇచ్చింది. రైతులకు సంబంధించిన అన్ని అంశాలకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పార్థసారథి తెలిపారు. ఇక, పొగాకు రైతులకు రూ.94 కోట్ల ఆర్థిక సహాయం అందించేందుకు కేబినెట్ నిర్ణయం తీసుకుంది. మార్క్‌ఫెడ్ ద్వారా ఈ మొత్తాన్ని నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు.

2 లో

# ఉద్యోగులకు ట్రాన్స్‌కో షాక్!

- మీడియాకు సమాచారం ఇస్తే కఠిన చర్యలు
- ముందస్తు అనుమతి లేకుండా మీడియాతో మాట్లాడొద్దు
- అంతర్గత సమాచారం బయటకు లీక్ చేస్తే చర్యలు
- సర్వీస్ రూల్స్ ఉల్లంఘిస్తే క్రమశిక్షణా చర్యలు
- గోప్యమైన విషయాలపై బహిరంగ చర్చలు వద్దు
- అసంపూర్ణ వార్తలతో సంస్థ ప్రతిష్టకు భంగం
- నిబంధనలు పాటించాల్సిందేనని హెచ్చరిక

2 లో

# స్థానిక పోరుకు డేట్ ఫిక్స్!

- ఎన్నికలు వాయిదా లేవు
- ముందుగా మున్సిపల్ ఎన్నికలు
- ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ
- చివరగా పంచాయతీ ఎన్నికలు
- కూటమి విజయానికి లోకేశ్ పిలుపు
- వైసీపీ కుయుక్తులు పారవన్న మంత్రి
- అక్టోబర్ నుంచే కొత్త పింఛన్లు




2 లో

**న్యూస్ డెస్క్, 03 సెప్టెంబరు (బిఎన్ఎస్):** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు అనుకున్న సమయానికే జరుగుతాయని, వాయిదా వేసే ప్రసక్తే లేదని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. అమరావతిలో టీడీపీ మంత్రులతో ఆయన బ్రేక్‌ఫాస్ట్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పార్టీ నాయకులకు, ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికల ప్రక్రియ అక్టోబర్ నాటికి పూర్తవుతుందని లోకేశ్ వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేసి, అన్ని స్థానాల్లోనూ కూటమి అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు సన్నద్ధం కావాలని మంత్రి లోకేశ్ పిలుపునిచ్చారు.

స్థానిక సంస్థల ఎన్నికలు దశలవారీగా జరుగుతాయని లోకేశ్ తెలిపారు.

# షాదాబ్ లైసెన్స్ సస్పెండ్!

- షాదాబ్ హోటల్‌కు ఫుడ్ సేఫ్టీ షాక్
- లైసెన్స్ సస్పెండ్.. వ్యాపారం నిలిపివేత
- కిచెన్‌లో అపరిశుభ్రత గుర్తింపు
- కాలం చెల్లిన ఆహార నిల్వలు స్వాధీనం
- మాంసం నిల్వలో తీవ్ర నిర్లక్ష్యం
- అధికారుల ఆకస్మిక తనిఖీలతో కలకలం
- నిబంధనల ఉల్లంఘనపై కఠిన చర్యలు
- ఇతర హోటళ్లపైనా అధికారుల ఫోకస్


2 లో

# 22-ఏ భూములపై జనసేన పోరు!

- సెప్టెంబర్ 4న ఇందిరాపార్క్‌లో దీక్ష
- బాధితులు, రైతులు భారీగా తరలిరావాలి
- భూముల రిజిస్ట్రేషన్లపై తక్షణ పరిష్కారం
- లక్షల కుటుంబాలకు భూముల సమస్య
- ఆస్తి హక్కుల పరిరక్షణే లక్ష్యం
- భూముల హక్కులు పునరుద్ధరించే వరకు పోరాటం
- రాజీ లేని పోరాటానికి జనసేన పిలుపు

2 లో

# ఉద్యోగులకు ట్రాన్స్‌కో షాక్!




**న్యూస్ డెస్క్, 03 సెప్టెంబరు (బిఎన్ఎస్):** తెలంగాణ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీజీ ట్రాన్స్‌కో)కు సంబంధించిన అధికారిక, అంతర్గత సమాచారాన్ని పత్రికలు, మీడియా లేదా బయటి వ్యక్తులకు చేరవేస్తే కఠిన క్రమశిక్షణా చర్యలు తప్పవని యాజమాన్యం హెచ్చరించింది. ఈ మేరకు టీజీ ట్రాన్స్‌కో సీఎండీ ఆదేశాల మేరకు తాజాగా సర్క్యులర్ జారీ అయింది. కొందరు అధికారులు, ఉద్యోగులు, ఆర్టిజన్లు ఉన్నతాధికారుల అనుమతి లేకుండా సంస్థకు చెందిన అంతర్గత వ్యవహారాలను ప్రెస్, మీడియా లేదా బయటి వ్యక్తులతో పంచుకుంటున్నారని యాజమాన్యం దృష్టికి వచ్చింది. ఇటువంటి అనధికారిక సమాచార మార్పిడి సర్వీస్ నిబంధనలు, ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించడమే కాకుండా సంస్థ గోప్యతను దెబ్బతీస్తోందని స్పష్టం చేసింది. దీనివల్ల మీడియాలో అసంపూర్ణ, తప్పుదోవ పట్టించే వార్తలు ప్రసారమై సంస్థ ప్రతిష్టకు భంగం కలుగుతోందని పేర్కొంది.

ముందస్తు అనుమతి తప్పనిసరి:

సంస్థలోని ఏ ఒక్క అధికారి, ఉద్యోగి లేదా ఆర్టిజన్ కూడా ఉన్నతాధికారుల ముందస్తు అనుమతి లేకుండా పత్రికలు, న్యూస్ ఏజెన్సీలు, టీవీ చానెళ్లు, డిజిటల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు, జర్నలిస్టులు, రిపోర్టర్లు లేదా ఫోటోగ్రాఫర్లతో మాట్లాడటం గానీ, సమాచారం అందించడం గానీ చేయకూడదని గట్టిగా ఆదేశించింది. అంతేకాకుండా క్యాంటీన్లు, కారిడార్లు, లిఫ్టులు, వెయిటింగ్ ఏరియాలు, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్, సామాజిక సమావేశాలు వంటి బహిరంగ ప్రదేశాల్లో సంస్థకు సంబంధించిన సున్నితమైన, గోప్యమైన అధికారిక విషయాలను ఎట్టిపరిస్థితుల్లోనూ చర్చించవద్దని స్పష్టం చేసింది. ఈ నిబంధనలను హెచ్‌వోడీలందరూ తమ పరిధిలోని ఉద్యోగులు, సిబ్బంది దృష్టికి తీసుకెళ్లాలని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే సర్వీస్ రూల్స్ ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

# 22-ఏ భూములపై జనసేన పోరు!



**న్యూస్ డెస్క్, 03 సెప్టెంబరు (బిఎన్ఎస్):** తెలంగాణ రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ల నిషేధిత జాబితా 'సెక్షన్ 22–ఏ' కింద చిక్కుకున్న భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, ప్రజల ఆస్తి హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ జనసేన పార్టీ పోరుబాట పట్టింది. ఈ సమస్యపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలనే ప్రధాన డిమాండ్‌తో సెప్టెంబర్ 4వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద భారీ నిరసన దీక్షను చేపట్టనున్నట్లు జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ శంకర్ గౌడ్ ప్రకటించారు. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభం కానున్న ఈ నిరసన దీక్షలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 22–ఏ బాధిత ప్రజలు, రైతులు, జనసేన శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

తెలంగాణలోని ప్రతి జిల్లా, నియోజకవర్గం, మండలం, డివిజన్ స్థాయి నాయకులు, మహిళా నేతలు, యువజన విభాగం ప్రతినిధులు పార్టీ కండువా ధరించి తప్పనిసరిగా ఈ దీక్షలో పాల్గొనాలని శంకర్ గౌడ్ సూచించారు. సరైన పత్రాలున్నా, దశాబ్దాలుగా సాగులో ఉన్నా ఎంతోమంది పేద, మధ్యతరగతి ప్రజల భూములను 22–ఏ పరిధిలో చేర్చి రిజిస్ట్రేషన్లు నిలిపివేయడంతో లక్షలాది కుటుంబాలు తీవ్ర ఆర్థిక, మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల కష్టార్జితమైన భూములపై యాజమాన్య హక్కులను పునరుద్ధరించే వరకు జనసేన బాధితుల పక్షాన నిలబడి రాజీలేని పోరాటం చేస్తుందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# ఢిల్లీలో కొత్త పార్టీ ఆవిర్భావం!

**మొదటి పేజీ తరువాయి**

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు రక్తం, చెమటోడ్చి నిర్మించిన ప్రజా ఉద్యమాన్ని ఆప్ నేతలు తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం తాకట్టు పెట్టారని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఉద్యమ విజయం తర్వాత దాని స్ఫూర్తిని తుంగలో తొక్కి 'టీమ్ కేజ్రీవాల్'గా మార్చేశారని ఆరోపించారు.

క్షేత్రస్థాయిలో పోరాడిన ఒక్క వాలంటీర్‌ను గానీ, నిరసనకారులను గానీ సంప్రదించకుండా.. అభిజిత్ దీప్కే తదితరులు ఇళ్లల్లో కూర్చొని ఏకపక్షంగా 12 మందితో కూడిన కమిటీని ఏర్పాటు చేశారని మండిపడ్డారు. సోషల్ మీడియాలో పోరాడిన వారిని విస్మరించి, ఆప్‌తో సంబంధమున్న ఎనిమిది మందితో పాటు వ్యక్తిగత స్నేహితులను మాత్రమే ఆ బృందంలో చేర్చుకున్నారని ఆయన విమర్శించారు. తాము ప్రతి రాష్ట్రం నుంచి ఐదుగురు ఉద్యమకారులు, వాలంటీర్లతో కూడిన నిజమైన జాతీయ స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించామని, హైకమాండ్ నియంతృత్వానికి తావులేకుండా పారదర్శక ఎంపిక ఉండాలని కోరినా పట్టించుకోలేదని బ్రహ్మభట్ ఆవేదన వ్యక్తం చేశారు.

తెరవెనుక నుంచి ఈ నిర్ణయాలన్నింటినీ అరవింద్ కేజ్రీవాలే నడిపించారని, ఆయన మొదటి నుంచీ ఉద్యమాలను వాడుకుని మోసం చేయడంలో సిద్ధహస్తుడని ఘాటు వ్యాఖ్యలు చేశారు. నాడు అన్నా హజారే చేపట్టిన అవినీతి వ్యతిరేక ఉద్యమాన్ని తన స్వప్రయోజనాల కోసం వాడుకున్నట్లే, నేడు ప్రజా ఉద్యమాలను హైజాక్ చేశారని మనీష్ బ్రహ్మభట్ విమర్శించారు. ఉద్యమకారుల ఆకాంక్షలకు అనుగుణంగా, ప్రజాస్వామ్యబద్ధమైన ప్రత్యామ్నాయాన్ని అందించేందుకే 'కాక్రోచ్ జనతా పార్టీ డెమోక్రటిక్'ను స్థాపించాల్సి వచ్చిందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# కొండా సురేఖకు కేఏ పాల్ ఆఫర్!



**న్యూస్ డెస్క్, 03 సెప్టెంబరు (బిఎన్ఎస్):** తెలంగాణ రాజకీయాల్లో సమీకరణాలు వేగంగా మారుతున్న తరుణంలో ప్రజాశాంతి పార్టీ అధినేత కేఏ పాల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర మంత్రి కొండా సురేఖ రాజీనామా వార్తల నేపథ్యంలో ఆయన ఆమెను తమ ప్రజాశాంతి పార్టీలోకి బహిరంగంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేఏ పాల్ మీడియాతో మాట్లాడుతూ.. "మీకు ప్రజాశాంతి పార్టీ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉన్నాయి, వేరే ఏ ఇతర పార్టీలోకి వెళ్లకండి" అని కొండా సురేఖకు సూచించారు. కాంగ్రెస్ పార్టీలో రెడ్డి నాయకుల పదవులకు ఎలాంటి ఢోకా ఉండదని, కేవలం బీసీ, బడుగు బలహీన వర్గాల నాయకుల పదవులకే ప్రమాదం పొంచి ఉందని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు.

రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలకు, బీసీ నాయకులకు నిజమైన న్యాయం జరగాలంటే ఒకే ఒక్క మార్గం ప్రజాశాంతి పార్టీయేనని కేఏ పాల్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ పాలనలో బీసీ నేతలకు ప్రాధాన్యత తగ్గడమే కాకుండా వారి పదవులకు భద్రత లేకుండా పోతోందని విమర్శించారు. కొండా సురేఖ వంటి బీసీ వర్గానికి చెందిన బలమైన నాయకురాలు ప్రజాశాంతి పార్టీలోకి వస్తే తగిన గౌరవం, ప్రాధాన్యత దక్కుతాయని పేర్కొన్నారు. మంత్రి కొండా సురేఖ రాజీనామా అంశంపై రకరకాల వార్తలు వస్తున్న నేపథ్యంలో కేఏ పాల్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం తెలంగాణ రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.

# స్థానిక పోరుకు డేట్ ఫిక్స్!

**మొదటి పేజీ తరువాయి**

ముందుగా మునిసిపల్ ఎన్నికలు జరుగుతాయని, ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు, ఆపై పంచాయతీ ఎన్నికలు పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశామని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. పెండింగ్ కేసులను పరిష్కరించుకుని, అన్ని స్థానాల్లోనూ ఎన్నికలు జరిగేలా శ్రమిస్తున్నామని తెలిపారు. వైసీపీ హయాంలో నిలిచిపోయిన అర్హులందరికీ అక్టోబర్ నెల నుంచి దశలవారీగా కొత్త పింఛన్లను మంజూరు చేస్తామన్నారు. ప్రతి దరఖాస్తును పరిశీలించి లబ్ధిదారులకు న్యాయం చేస్తామని మంత్రి లోకేశ్ భరోసా ఇచ్చారు.

కుయుక్తులు, కుట్రలు పారవ్..

ఎన్నికలు వాయిదా పడాలంటూ ప్రతిపక్ష వైసీపీ పన్నుతున్న కుయుక్తులు, కుట్రలు ఎట్టిపరిస్థితుల్లోనూ పారవని లోకేశ్‌హెచ్చరించారు. ఎన్నికలు వాయిదా పడితే కేంద్ర ఫైనాన్స్ కమిషన్ నుంచి వచ్చే నిధులు ఆగిపోతాయనే దురుద్దేశంతోనే ప్రతిపక్షం కోర్టు కేసులతో అడ్డంకులు సృష్టిస్తోందని ఆయన ఆరోపించారు. అయితే ప్రభుత్వం చట్టపరమైన చిక్కులన్నింటినీ అధిగమించి, అనుకున్న సమయానికే స్థానిక ఎన్నికలను పూర్తి చేసి తీరుతుందని నారా లోకేశ్ స్పష్టం చేశారు.

# రూపాయి బలం.. డాలర్ డౌన్!

**మొదటి పేజీ తరువాయి**

ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్చేంజ్ మార్కెట్ ఆరంభంలో 94.30 వద్ద ప్రారంభమైన రూపాయి, కొనుగోళ్ల మద్దతుతో మరింత బలపడి 94.26 వద్దకు చేరి లాభాల్లో ట్రేడవుతోంది. అంతకుముందు బుధవారం ముగింపు సమయానికి రూపాయి విలువ 22 పైసలు లాభపడి 94.73 వద్ద స్థిరపడగా, తాజా సెషన్‌లోనూ అదే సానుకూల జోరును కొనసాగించి ఒక్కసారిగా భారీ ఎత్తున పురోగతి సాధించింది.

దేశంలో విదేశీ మారక ద్రవ్య లిక్విడిటీని పెంపొందించేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రవేశపెట్టిన ప్రత్యేక చర్యల్లో భాగంగా, ఎఫ్‌సీఎన్ఆర్(బి) డిపాజిట్ల ద్వారా రికార్డు స్థాయిలో భారీగా విదేశీ నిధులు వచ్చి చేరడమే రూపాయికి ప్రధాన ఊతంగా నిలిచిందని ఫారెక్స్ మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరల పెరుగుదల, గ్లోబల్ బాండ్ ఈల్డ్స్ ఒత్తిడి వంటి ప్రతికూల అంశాలు ఉన్నప్పటికీ.. ఆర్బీఐ సమర్థవంతమైన జోక్యం, దేశీయ స్టాక్ మార్కెట్లలో విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల బలమైన కొనుగోళ్లు దేశీయ కరెన్సీకి కొత్త ఉత్సాహాన్ని అందించాయని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

# షాదాబ్ లైసెన్స్ సస్పెండ్!

**న్యూస్ డెస్క్, 03 సెప్టెంబరు (బిఎన్ఎస్):** హైదరాబాద్ పాతబస్తీలోని మదీనా సర్కిల్ సమీపంలో ఉన్న ప్రముఖ బిర్యానీ కేంద్రం 'హోటల్ షాదాబ్' ఫుడ్ సేఫ్టీ లైసెన్స్‌ను తెలంగాణ ఆహార భద్రతా విభాగం అధికారులు తాత్కాలికంగా సస్పెండ్ చేశారు. నగరవ్యాప్తంగా ఆహార నాణ్యతా ప్రమాణాల పరిశీలనలో భాగంగా ఫుడ్ సేఫ్టీ అధికారులు, పోలీసులతో కూడిన ప్రత్యేక బృందాలు షాదాబ్ హోటల్‌లో ఆకస్మిక తనిఖీలు చేపట్టాయి. ఈ తనిఖీల్లో కిచెన్ పరిసరాల్లో అపరిశుభ్రత, మాంసం, ఇతర ఆహార పదార్థాలను నిల్వ చేయడంలో తీవ్రమైన నిర్లక్ష్యం, కాలం చెల్లిన ఆహార నిల్వలు ఉండటాన్ని అధికారులు గుర్తించినట్లు తెలుస్తుంది.

నిబంధనలను తీవ్రంగా ఉల్లంఘించినందుకు గాను హోటల్ ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్‌ను సస్పెండ్ చేయడంతో పాటు హోటల్ వ్యాపార కార్యకలాపాలను వెంటనే నిలిపివేయాలని యాజమాన్యాన్ని ఆదేశించినట్లు సమాచారం. బిర్యానీ ప్రియులకు ఎంతో ఇష్టమైన, దశాబ్దాల చరిత్ర కలిగిన షాదాబ్ హోటల్‌పై అధికారులు ఈ విధమైన కఠిన చర్యలు తీసుకోవడం నగరవాసులను విస్మయానికి గురిచేసింది. నిబంధనలు పాటించని ఇతర హోటళ్లకు కూడా నోటీసులు జారీ చేసి, తదుపరి చర్యలు వేగవంతం చేసినట్లు అధికారులు స్పష్టం చేశారు.

# దేశభక్తిలో అసద్‌కు సాటి లేరు!



**న్యూస్ డెస్క్, 03 సెప్టెంబరు (బిఎన్ఎస్):** సైదాబాద్ స్టీల్ బ్రిడ్జిని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అసదుద్దీన్‌కు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. అసదుద్దీన్, ఎంఐఎం పార్టీ దేశానికి వ్యతిరేకం అనేది కొందరి దుష్ప్రచారం మాత్రమేనని వ్యాఖ్యానించారు. దేశభక్తిలో మోడీ, అమిత్ షాలకు అసద్ ఏమీ తక్కువ కాదని స్పష్టం చేశారు. సైదాబాద్ స్టీల్ బ్రిడ్జికి గత ప్రభుత్వం కొబ్బరికాయ కొట్టిందన్నారు. కానీ ఒక్క రూపాయి ఇవ్వలేదని విమర్శించారు. తాను సీఎం అయ్యాక.. అక్బరుద్దీన్, అసదుద్దీన్‌తో ఓల్డ్ సిటీ అభివృద్ధిపై చర్చించానని చెప్పారు.

ఇన్నేళ్లలో ఎంతమంది సీఎంలు ఓల్డ్ సిటీకి వచ్చారని ప్రశ్నించారు. పాతబస్తీ గల్లీలోకి తాను తప్ప ఇంకెవరూ రాలేదని చెప్పారు. ఓల్డ్‌సిటీ అభివృద్ధి కోసం అసదుద్దీన్ ఏం చెప్పినా.. వెంటనే మంజూరు చేయాలని జిహెచ్ఎంసీ కమిషనర్‌ను ఆదేశిస్తున్నానని చెప్పారు. ఓల్డ్ సిటీ పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లో లక్ష ఇళు నిర్మించి ఇవ్వడమే తమ లక్ష్యం అని అన్నారు. పెద్దలు కబ్జా చేసిన భూములను తీసుకుని పేదలకు ఇళ్లు కట్టిస్తామని హామీ ఇచ్చారు. ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ ఇచ్చిందే వైఎస్ఆర్ అని చెప్పారు. రాష్ట్రంలో హిందువులు, ముస్లింలు కలిసి ఉండాలని వ్యాఖ్యానించారు.

# కేబినెట్‌లో రాజగోపాల్‌కు చాన్స్?

**మొదటి పేజీ తరువాయి**



కేబినెట్‌లోకి తీసుకున్నా తీసుకోకపోయినా ప్రజల తరఫున మాట్లాడుతానన్నారు. తన సోదరుడికి మంత్రి పదవి ఇచ్చాం.. ఒకే ఇంట్లో ఇద్దరికి వద్దు అనే విషయంతోనే తన మంత్రి పదవి ఆలస్యం అవుతోందన్నారు. 'తన సోదరుడిని ఒప్పించి ఏదైనా నిర్ణయం తీసుకుంటే ఓకే. ఒక వేళ మంత్రి పదవి లేకపోయినా పర్వాలేదు' అన్నారు. మంత్రి పదవి కోసం నేనేం ఢిల్లీకి వెళ్లి కాళ్లు పట్టుకుని పైరవీలు చేయడం లేదు కదా? జూన్ 5వ తేదీన రాహుల్ గాంధీని కలిసి అన్ని విషయాలు వివరంగా చెప్పానని ఆయనకు మొత్తం అర్థం అయిందన్నారు. కొండా సురేఖకు ఒక న్యాయం కోమటిరెడ్డికి మరో న్యాయమా అని వస్తున్న వ్యాఖ్యలపై స్పందిస్తూ.. తానెప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తిట్టలేదన్నారు. గతంలో బీజేపీలో ఉండగా నన్ను విమర్శిస్తే అప్పుడు నేను విమర్శించానే తప్ప సీఎం అయ్యాక రేవంత్ రెడ్డిని వ్యక్తిగతంగా ఏమీ అనలేదన్నారు. తానే 10 ఏళ్లు సీఎంగా ఉంటానన్న సందర్భంలో మాత్రం జాతీయ పార్టీలో ఇలాంటి ప్రకటలు సరికాదని చెప్పానన్నారు.

**ఆయన స్థానంలో రాజగోపాల్ రెడ్డికి చాన్స్?:**

కొండా సురేఖను బర్తరఫ్ చేయడంతో మంత్రి వర్గ విస్తరణ అనివార్యత మరింత ఏర్పడింది. ఈ నేపథ్యంలో కొత్త వారికి ఎవరికి అవకాశాలు దక్కబోతున్నాయనే చర్చ జరుగుతోంది. ఇప్పటికే ఆశావహుల జాబితా భారీగా ఉన్న ఈ నేపథ్యంలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తాజా వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారుతున్నాయి. తన అన్నను ఒప్పించి తనకు మంత్రి పదవి ఇస్తే తీసుకుంటానంటూ రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యల వెనుక అంతరార్థం ఏంటనే చర్చ తెరమీదకు వస్తోంది. త్వరలో జరగోబోయే మంత్రి వర్గ విస్తరణలో కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని తప్పించి అతని స్థానంలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని తీసుకోబోతున్నారా? అసలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలంటే వెంకట్ రెడ్డి అనుమతి తీసుకోవాల్సిన అవసరం ఏముందనే టాక్ వినిపిస్తోంది. రాజగోపాల్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యల వెనుక ఏదో మతలబు ఉందనే గుసగుసలు పొలిటికల్ సర్కిల్స్ లో వినిపిస్తున్నాయి.

# రైతులకు సర్కార్ గుడ్‌న్యూస్!

**మొదటి పేజీ తరువాయి**



రైతులకు ఇబ్బందులు లేకుండా ఆర్థికంగా అండగా నిలిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు.

**6,212.50 ఎకరాల భూసమీకరణకు ఆమోదం**

అమరావతిలో రైల్వే లైన్, ఇన్నర్ రింగ్ రోడ్, గ్రిడ్ రోడ్ల విస్తరణ కోసం మొత్తం 6,212.50 ఎకరాల భూసమీకరణ ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది. కంతేరు గ్రామంలో 974 ఎకరాలు, తాడికొండ గ్రామంలో 5,238.50 ఎకరాలు భూసమీకరణ చేయనున్నారు. ఎర్రుపాలెం--నంబూరు మీదుగా కొత్త బ్రాడ్‌గేజ్ రైల్వే లైన్ నిర్మాణానికి కూడా ఆమోదం లభించింది. రైల్వే మార్గానికి ఇరువైపులా 50 మీటర్ల చొప్పున మొత్తం 100 మీటర్ల బఫర్‌తో భూముల సేకరణ చేపట్టనున్నారు. రైతుల విజ్ఞప్తుల మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

**రూ.759.79 కోట్లతో అమరావతి సంగమం**

అమరావతిలోని శాఖమూరులో రూ.759.79 కోట్లతో అమరావతి సంగమం ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఇందులో రాష్ట్ర పబ్లిక్ లైబ్రరీ, ఆడిటోరియం, సుపరిపాలన సంస్థలు ఉండనున్నాయి. ఈ ప్రాజెక్టుకు డీపీఎల్ నుంచి రూ.310.08 కోట్లు, ఏపీహెచ్ఆర్‌డీఐ నుంచి రూ.277.94 కోట్లు, ఏపీ సీఆర్‌డీఏ నుంచి రూ.171.76 కోట్లు సమకూర్చనున్నారు.

**ఎల్పీఎస్ రోడ్లపై కీలక నిర్ణయం**

అమరావతి రాజధాని నగరంలోని ఎల్పీఎస్ రోడ్ల నిర్మాణంపై కూడా కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. సిమెంట్ కాంక్రీట్ రోడ్ల స్థానంలో బిటుమినస్ రోడ్లను నిర్మించే ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. రాజధాని నగరంలో కొత్త భూ కేటాయింపులకు కూడా కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుంది. మంత్రుల బృందం చేసిన సిఫార్సులకు ఆమోదం తెలిపింది.

**నాలుగు జిల్లాల్లో వరద నష్టం పనులు**

కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో వరదల కారణంగా దెబ్బతిన్న మౌలిక వసతుల పునరుద్ధరణకు చర్యలు చేపట్టనున్నారు. నాలుగు జిల్లాల్లో మొత్తం 78 వరద నష్టం పనులకు రూ.6.25 కోట్లను కేటాయించనున్నారు. మరోవైపు.. వెలిగొండ టన్నెల్–2 వద్ద బోరింగ్ యంత్రాన్ని తొలగించేందుకు రూ.11.63 కోట్లు కేటాయించేందుకు కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ప్రాజెక్టు పనులను ముందుకు తీసుకెళ్లడంలో భాగంగా ఈ నిధులను వినియోగించనున్నారు.

**న్యాయ, వైద్య రంగాల్లోనూ కీలక నిర్ణయాలు**

మంగళగిరి అదనపు జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి కోర్టుకు 21 పోస్టులు మంజూరు చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే రాజమహేంద్రవరం ఈఎస్ఐ ఆసుపత్రి ఆధునీకరణ ప్రతిపాదనకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీంతో న్యాయ, వైద్య సేవలను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

# 'బర్తరఫ్'పై కొండా ఫైర్!

**మొదటి పేజీ తరువాయి**

మంత్రివర్గం నుంచి తనను తొలగించాలని సీఎం రేవంత్ రెడ్డి గవర్నర్‌కు సిఫార్సు చేసిన నేపథ్యంలో కొండా సురేఖ తాజాగా మీడియా సమావేశం నిర్వహించి సంచలన వ్యాఖ్యలకు తెరలేపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీకి తాను రాసిన లేఖలను మీడియా ముందు విడుదల చేశారు. తనపై తీసుకున్న చర్యను తీవ్రంగా తప్పుబట్టిన కొండా సురేఖ.. ఉరిశిక్ష పడిన ఖైదీకి కూడా చివరిసారిగా ఏదైనా చెప్పుకునే అవకాశం ఇస్తారని.. కానీ తనకు ఆ మాత్రం అవకాశం కూడా ఇవ్వలేదని తెలిపారు.

ఇక నిన్న మొన్న తాను, సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జిమీనాక్షి నటరాజన్, పలువురు మంత్రులు ఢిల్లీలోనే ఉన్నామని చెప్పిన కొండా సురేఖ.. తనను రాజీనామా చేయమని ఎవరూ అడగలేదని పేర్కొన్నారు. ఒకవేళ తనను అడిగి ఉంటే తానే స్వయంగా మంత్రి పదవికి రాజీనామా చేసేదాన్ని అని తెలిపారు. తన వివరణ తీసుకుని చర్యలు తీసుకుంటే బాగుండేదని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు. తాను నిజంగా తప్పు చేసి ఉంటే బర్తరఫ్ చేసినా బాధపడేదాన్ని కాదని.. కానీ తన వాదన వినకుండా నిర్ణయం తీసుకోవడం బాధాకరమని అన్నారు.

తన కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయడాన్ని కూడా కొండా సురేఖ ప్రశ్నించారు. తన కుమార్తె ఒక స్వతంత్ర మహిళ అని.. ఆమె అభిప్రాయాలు ఆమె వ్యక్తిగతం అని చెప్పారు. ఆమె వ్యాఖ్యలను తాను ఖండించాల్సిన అవసరం లేదని.. తన కుమార్తె అభిప్రాయాన్ని తప్పుపట్టే అధికారం కూడా తనకు లేదని పేర్కొన్నారు. తన కుమార్తె వ్యాఖ్యలకు తనపై చర్యలు తీసుకోవడం బాధాకరమని.. ఆమె వ్యాఖ్యలకు తనను ఎలా బాధ్యురాలిని చేస్తారని కాంగ్రెస్ పెద్దలను ప్రశ్నించారు.

ప్రతి ఆడబిడ్డ ఆశీర్వాదం రేవంత్ రెడ్డికి ఉంటాయి.. రాఖీ కట్టిన కొండా సురేఖ

ఇదే సమయంలో కాంగ్రెస్ నేతలు జగ్గారెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై పార్టీ ఎలాంటి చర్యలు తీసుకుందని కొండా సురేఖ ఏఐసీసీ వర్గాలను నిలదీశారు. తనపై మాత్రం కక్షపూరితంగా చర్యలు తీసుకున్నారని భావిస్తున్నానని ఆరోపించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డిపై కూడా కొండా సురేఖ కీలక వ్యాఖ్యలు చేశారు. తాను ఎలాంటి తప్పు చేయలేదని.. తనకు పశ్చాత్తాపం లేదని స్పష్టం చేశారు. తన విషయంలో రేవంత్ రెడ్డి ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు.

వైఎస్ రాజశేఖర్ రెడ్డి తర్వాత తాను రేవంత్ రెడ్డినే ఎక్కువగా అభిమానించానని.. ఆయన పీసీసీ అధ్యక్షుడు కావాలని, ముఖ్యమంత్రి కావాలని తానే ముందుగా కోరుకున్నానని కొండా సురేఖ గుర్తుచేశారు. తాను సీఎం రేవంత్ రెడ్డిపై గానీ, కాంగ్రెస్ పార్టీపై గానీ ఎలాంటి విమర్శలు చేయలేదని పేర్కొన్నారు. గతంలో పలువురు కాంగ్రెస్ నేతలు పార్టీపై, పార్టీ నాయకత్వంపై విమర్శలు చేసిన సందర్భాలను ప్రస్తావిస్తూ.. వారికి పదవులు ఇచ్చారని, తన విషయంలో మాత్రం భిన్నంగా వ్యవహరించారని వ్యాఖ్యానించారు.

ఒక బీసీ మహిళను ఇలా అవమానకరంగా పదవి నుంచి తొలగించడం చాలా బాధాకరమని కొండా సురేఖ వ్యాఖ్యానించారు. తనను తొలగించినందుకు బాధపడటం లేదని.. కానీ కారణం చెప్పకుండా తొలగించడాన్ని జీర్ణించుకోలేకపోతున్నానని చెప్పారు. తనపై తీసుకున్న చర్యలకు కారణం చెప్పాల్సిన బాధ్యత సీఎం రేవంత్ రెడ్డితోపాటు.. ఏఐసీసీపై కూడా ఉందని డిమాండ్ చేశారు. మంత్రిగా ఉన్న సమయంలో తనకు ఎలాంటి అధికారాలు లేకుండా చేశారని కొండా సురేఖ సంచలన ఆరోపణలు చేశారు. తన ప్రమేయం లేకుండానే తన శాఖలో పలు నిర్ణయాలు తీసుకున్నారని.. తనకు తెలియకుండానే తన ఓఎస్‌డీ సుమంత్‌ను తొలగించారని చెప్పారు.

అభివృద్ధి విషయంలో తన నియోజకవర్గంపై వివక్ష చూపారని కొండా సురేఖ ఆరోపించారు. తన శాఖకు సంబంధించిన వ్యవహారాల్లో కడియం శ్రీహరి జోక్యం చేసుకున్నారని.. తన శాఖ అధికారులతో ఆయన సమీక్షలు నిర్వహించారని పేర్కొన్నారు. తన తదుపరి రాజకీయ అడుగుపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని కొండా సురేఖ తెలిపారు. భర్త కొండా మురళితో చర్చించిన తర్వాత భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. తన వల్ల ముగ్గురు బీసీ మహిళలకు పదవులు దక్కడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. అయితే తన కోసం డాక్టర్ జి. చిన్నారెడ్డిపై చర్యలు తీసుకోవడం సరికాదని అభిప్రాయపడ్డారు.

# అపరిచిత వ్యక్తికి రాపూరు CHCలో సకాలంలో వైద్యం

**● సకాలంలో స్పందించిన రాపూరు యువత**




నెల్లూరు జిల్లా రాపూరు(బిఎన్ఎస్): – నెల్లూరు జిల్లా రాపూరు పట్టణంలోని ట్రక్ ఆటో స్టాండ్ వద్ద తీవ్ర అనారోగ్యంతో దీనస్థితిలో ఉన్న అపరిచిత వ్యక్తిని స్థానిక యువత మానవతా దృక్పథంతో రాపూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సెప్టెంబర్ 1న రాత్రి ఆసుపత్రికి చేరుకున్న అతడికి వెన్ను భాగంలో తీవ్రమైన గాయం, రక్తస్రావం ఉండటంతో వైద్యులు తక్షణమే చికిత్స అందించారు. బంధువులు, అటెండర్లు ఎవరూ లేకపోవడంతో ఆసుపత్రి సిబ్బంది ఆహారం, సంరక్షణతో పాటు నిరంతర వైద్య సేవలు అందించారు.

పరిస్థితి తీవ్రంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం ఉన్నత వైద్య కేంద్రానికి తరలించారు. ఇందుకు సహకరించిన రాపూరు ఎస్ఐ, ఎంఆర్ఓ, సిబ్బందికి వైద్యులు కృతజ్ఞతలు తెలిపారు. 108 అంబులెన్స్ ద్వారా సురక్షితంగా తరలించినట్లు CHC సూపరింటెండెంట్ డా. షేక్ అర్షియా తెలిపారు.

చికిత్స అనంతరం ఆ వ్యక్తి తన పేరు నక్కా మనోజ్, డక్కిలి ప్రాంతానికి చెందినవాడినని తెలిపినట్లు వెల్లడించారు. ఆయన కుటుంబ సభ్యులు లేదా బంధువులు గుర్తిస్తే సంబంధిత అధికారులను సంప్రదించాలని కోరారు.

# సీఎం పర్యటనకు ఏర్పాట్లు చేయాలి.. కలెక్టర్



నల్లగొండ (బిఎన్ఎస్): ఈనెల 5 న నల్గొండ జిల్లా, నకిరేకల్ లో జరిగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి .చంద్రశేఖర్ జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ లో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ తో కలిసి సమీక్షించారు.. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఈనెల 5న హెలికాప్టర్ ద్వారా నకిరేకల్ కు చేరుకుని 100పడక లతో నూతనంగా నిర్మించిన నకిరేకల్ ఏరియా ఆసుపత్రి ప్రారంభించి, అనంతరం నకిరేకల్ మినీ స్టేడియంలో జరిగే బహిరంగ సభలో పాల్గొని అక్కడే వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని తెలిపారు.. ముఖ్యమంత్రి రాక సందర్భంగా ఆయా శాఖల ద్వారా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని , రోడ్ల మరమ్మతు, పార్కింగ్, విద్యుత్ సరఫరా వంటి అంశాలలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.. పోలీస్ శాఖ తరపున అవసరమైన బందోబస్తు, బహిరంగ సభ నిర్వహించే స్టేడియం చుట్టు పక్కల శానిటేషన్ నిర్వహించాలని, పట్టణంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోడ్లు, మున్సిపల్ రోడ్లు, పంచాయతీ రోడ్లు, గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని చేపట్టాలని ఆదేశించారు .

# క్రీడల్లో ప్రతిభ కనబరిచిన జిల్లా క్రీడాకారులకు జిల్లా కలెక్టర్ అభినందనలు



అమలాపురం (బిఎన్ఎస్) సెప్టెంబర్ 03 :అమరావతి ఛాంపియన్‌షిప్--2026లో కోనసీమ జిల్లాకు చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అభినందించారు. గురువారం స్థానిక కలెక్టరేట్లోని కలెక్టర్ ఛాంబర్ నందు అమరావతి ఛాంపియన్ షిప్ 20 26 వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ఆయన చేతుల మీదుగా గోల్డ్ రజక పథకాలను అందజేశారు. వివిధ క్రీడాంశాల్లో పాల్గొన్న క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభతో జిల్లా ఖ్యాతిని చాటిన రెండు జతల బూట్లు స్పోర్ట్స్ టి షర్ట్ బహుమతులు ఆయన చేతుల మీదుగా క్రీడాకారులకు ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని అలవర్చుకుని అత్యుత్తమ స్థానాల్లో ఎదగాలని ఆయన కోరారు.

బాస్కెట్‌బాల్ అండర్--17 బాలికల విభాగంలో విజేతలుగా, బ్యాడ్మింటన్ అండర్--23 పురుషుల విభాగంలో విజేతలుగా నిలిచి స్వర్ణ విజయాన్ని సాధించారు.

బాక్సింగ్‌లో అండర్--23 మహిళల 45--48 కిలోల విభాగంలో, అలాగే 48--54 కిలోల విభాగంలో క్రీడాకారులు రజత పతకాలు సాధించారు. వెయిట్‌లిఫ్టింగ్ అండర్--17 బాలుర విభాగంలో కూడా రజత పతకం సాధించారు.జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో క్రీడాకారులకు అందిస్తున్న శిక్షణ, ప్రోత్సాహం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ విజయాల ద్వారా జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో తమ ప్రతిభను చాటారని అధికారులు తెలిపారు. క్రీడాకారులను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ సమావేశంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి వీ.రుద్ర, సమాచార పౌర సంబంధాలు శాఖ అధికారి సిహెచ్ శ్రీనివాస్ పీఈటీలు క్రీడా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా

# వీరణాల శివకుమార్..



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా సెప్టెంబర్ 03: భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ 16 వ రాష్ట్ర మహాభలు సెప్టెంబర్ 1,2,3 తేదీలలో నెల్లూరు నగరం లో జరిగాయని, ఈ మహాసభలో నూతన రాష్ట్ర కమిటీ ఎన్నుకోవడం జరిగిందని, రాష్ట్ర కమిటి లో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వీరణాల శివకుమార్ ను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర కమిటీలో కడపజిల్లా నుండి ఇద్దరికి చోటు కల్పించినందుకు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్నందుకు రాష్ట్ర కమిటీకి ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా రాష్ట్రంలో, జిల్లాలో నిరుద్యోగ సమస్యల పై పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల అమలు కోసం ఉద్యమిస్తామని ఖాళీ పోస్టుల భర్తీకై, నిరుద్యోగ భృతి 3000 ఇవ్వాలని, పరిశ్రమల ఏర్పాటుకు వేల ఎకరాలు ప్రభుత్వం భూసేకరణ చేస్తున్నదని అందులో స్థానిక యువతకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ల సాధనకోసం యువతను చైతన్యపరిచి పోరాటాలు సాగిస్తామని తెలిపారు..

# బెంగుళూరు డాక్టర్ రవి ప్రకాష్ కిడ్నాప్ కేసు పై స్పందించిన మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా.!



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా సెప్టెంబర్ 03: మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ.. గత మూడు రోజుల క్రిందట బెంగళూరుకు చెందిన డాక్టర్ రవి ప్రకాష్ ను పుట్టా సుధాకర్ యాదవ్ అను నేను నా కుమారుడు కలిసి కిడ్నాప్ చేశామంటూ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున నాపై కిడ్నాప్ ఆరోపణలు చేయడం వైసిపి ఆడిన నాటకమే, వైసీపీ నాయకులు పనికట్టుకుని బురదజల్లే ప్రయత్నం చేశారే. తప్ప అందులో ఏమాత్రం నిజం లేదు అన్న విషయం కాస్త ఆలస్యంగా తెలుసు కున్నట్టున్నారు అన్నారు. నాపై కిడ్నాప్ కేసు పెట్టారన్న విషయం సామాజిక మాధ్యమాల ద్వారానే నాకు తెలిసిందన్నారు. నేను హైదరాబాదులో ఉంటే బెంగళూరులో ఎలా కిడ్నాప్ చేస్తాను, డాక్టర్ రవి ప్రకాష్ ను పోలీసుల అరెస్టు చేస్తే నేను ఎలా కిడ్నాప్ చేస్తాను అన్నారు. ఏమైనా డాక్టర్ రవి ప్రకాష్ ఆత్మను కిడ్నాప్ చేశాను అనుకున్నారేమో వైసిపి వాళ్లు అంటూనే కిడ్నాప్ చేయాల్సిన అవసరం నాకు కానీ, నా కుమారునికి కానీ లేదన్నారు. ఒక బాధ్యతగల శాసనసభ్యునిగా చట్టాన్ని గౌరవిస్తాను అన్నారు. కిడ్నాప్ వ్యవహారమంతా వైసిపి కల్పితమే, డాక్టర్ రవి ప్రకాష్ కు మాకు స్థల విషయంలో వివాదం ఉన్న మాట వాస్తవమే, అందులో

2021లో డాక్టర్ రవి ప్రకాష్ మాకు ఆ స్థలాన్ని అమ్మేశాడు. కానీ డాక్టర్ రవి ప్రకాష్ దుర్బుద్ధితో రిజిస్ట్రేషన్ క్యాన్సిల్ చేయమని కోర్టును ఆశ్రయించాడు. కోర్టులో కూడా మాకు అనుకూలంగా తీర్పు వచ్చింది. మళ్లీ పైకోర్టు కు అపీల్ చేయడంలో కోర్టులో ప్రస్తుతం వివాదం నడుస్తున్న మాట వాస్తవమే. కానీ కోర్టు వివాదంలో ఉండగా నేను బాధ్యత గల పౌరునిగా చట్టాన్ని గౌరవిస్తానే తప్ప చట్టాన్ని అతిక్రమించను అన్నారు. గత నెలలో ఉప్పుగుంట పల్లెలో మా మేనేజర్ గా ఉన్న మురళీకృష్ణ యాదవ్ పై దాడి చేయడంలో పోలీసులు అరెస్టు చెయ్యబోతే నేను కిడ్నాప్ చేశాను అనడం దారుణం అన్నారు. కిడ్నాప్ వ్యవహారమంతా వైసిపి ఆడిన నాటకమే తప్ప అందులో మరొకటి లేదన్నారు. పై విషయాలన్నీ కూడా మైదుకూరు నియోజకవర్గ ప్రజలు గమనిస్తున్నారు. కాబట్టి రాబోయే రోజుల్లో వైసిపి వాళ్లు చేసే దుష్ప్రచారాలకు తగిన విధంగా గుణపాఠం చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు.

# కడప లో మార్కెట్ యార్డ్ హమాలీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలి.!!




**సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ డిమాండ్**

బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా సెప్టెంబర్ 03: కడప నగరంలోని మార్కెట్ యార్డ్ లో హమాలీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, సిఐటియు నగర అధ్యక్ష కార్యదర్శులు వెంకటసుబ్బయ్య, చంద్రారెడ్డిలు మార్కెట్ యార్డ్ కన్వీనర్ కర్రేటి రవి నరసింహులు ఒక సంయుక్త ప్రకటనలో యార్డ్ అధికారులను డిమాండ్ చేశారు. ముఖ్యంగా కడప మార్కెట్ యార్డ్ లో దాదాపు 20 మంది కమిషన్ ఏజెంట్స్ ఉన్నారని తెలిపారు. ఇందులో దాదాపు 300 మంది దాకా సీజనల్ ఆన్ సీజనల్ హమాలీలు పనిచేస్తున్నారని తెలిపారు. ఇందులో ముఖ్యంగా ప్రతి మండికి ఒకరు లేదా ఇద్దరు, మహిళా కార్మికులు ఉన్నారని తెలిపారు. వీరు స్వీపింగ్ పని చేస్తా ఉన్నారు .వీరికి కనీసం మినిమం కూడా డబ్బులు రావడం లేదు. అత్యంత దౌర్భాగ్యమైన పరిస్థితి ఏమిటంటే మార్కెట్ యార్డ్ లో మహిళా కార్మికులకు మరుగుదొడ్ల సౌకర్యం లేక తీవ్ర మనోవేదనకు గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతములో ఎన్నిసార్లు అధికారుల దృష్టికి, పాలకుల దృష్టికి తీసుకెళ్లిన అదిగో చేస్తాం, ఇదిగో చేస్తాం.. అంటున్నారు తప్ప జరగడం లేదు. మహిళా కార్మికులు మరుగుదొడ్ల సౌకర్యం లేక అనేక రకాల వ్యాధులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్రం వచ్చి 80 సంవత్సరాలు దాటినప్పటికీ కడప మార్కెట్ యార్డ్ లో మరుగు దొడ్ల సౌకర్యం లేకపోవడం దుర్మార్గమని తెలిపారు. వీళ్ళు పని చేస్తున్న కొందరి దయా దాక్షిణాల మీద ఆధారపడడం దారుణమని తెలిపారు. ఇప్పటికైనా కడప మార్కెట్ యార్డ్ లో మహిళలందరికీ మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు . హమాలి కార్మికులకు కూర్చొని అన్నం తినడానికి సౌకర్యం లేదన్నారు.అలాగే గతంలో ఇచ్చిన మాదిరిగా ఐడెంటి కార్డ్స్, బట్టలు ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరారు. వీటన్నిటి పైన రాతపూర్వకంగా , ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చంనాయుడు, జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ వారికి రాతపూర్వకంగా పంపుతామని తెలియజేశారు. అప్పటికి సమస్యలు పరిష్కారంగా కాక పోతే పెద్ద ఎత్తున కడప మార్కెట్ యార్డ్ నందు సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

# జిమ్ ట్రైనర్ హత్య కేసులో నలుగురి అరెస్టు

**మార్ఫింగ్ ఫొటోలే హత్యకు కారణం**
**అదనపు ఎస్పీ కిషోర్‌కుమార్ వెల్లడి**



కాకినాడ, (బిఎన్ఎస్) సెప్టెంబరు 3: కాకినాడ భానుగుడి సెంటర్‌లో జిమ్ ట్రైనర్ కొడమాటి సతీష్‌రెడ్డి హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు కాకినాడ జిల్లా అదనపు ఎస్పీ, కాకినాడ ఇన్‌చార్జి ఎస్‌డీపీవో డాక్టర్ మహంతి కిషోర్‌కుమార్ తెలిపారు. గురువారం కాకినాడ డివిజనల్ పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు.

కాకినాడ రామకృష్ణారావుపేటకు చెందిన సతీష్‌రెడ్డి ఆగస్టు 26న తెల్లవారుజామున 2 గంటల సమయంలో భానుగుడి సెంటర్‌లోని చార్మినార్ టీ సెంటర్ వద్ద హత్యకు గురయ్యాడు. మృతుడి స్నేహితుడైన బొందల సాయికిరణ్‌తో పాటు ఇంటి సత్యనారాయణ, ప్రయాగ దుర్గాప్రసాద్, ఇంటి ఆదికృష్ణ కలిసి సతీష్‌రెడ్డిపై దాడి చేసినట్లు దర్యాప్తులో తేలింది. మొదట కాళ్లతో తన్నడంతో పాటు చెక్కబద్దతో తల, ముఖం, శరీరంపై దాడి చేశారు. చెక్కబద్ద విరిగిపోవడంతో దాని పదునైన ముక్కతో సాయికిరణ్ సతీష్‌రెడ్డి గొంతులో పలుమార్లు పొడిచినట్లు పోలీసులు తెలిపారు.

**మార్ఫింగ్ ఫొటోలపై విభేదాలు**

ప్రధాన నిందితుడు సాయికిరణ్‌కు ప్రేమ వ్యవహారానికి సంబంధించి సతీష్‌రెడ్డితో విభేదాలు ఏర్పడ్డాయని పోలీసులు తెలిపారు. సాయికిరణ్ మరో యువతితో ఉన్నట్లుగా సతీష్‌రెడ్డి మార్ఫింగ్ చేసిన ఫొటోలను అతని ప్రియురాలికి పంపడంతో ఇద్దరి మధ్య వివాదం తలెత్తినట్లు విచారణలో వెల్లడైందన్నారు. సతీష్‌రెడ్డి తనను చంపుతానని బెదిరించడంతో, అతను బతికి ఉంటే తనకు ప్రాణహాని ఉంటుందనే ఉద్దేశంతో హత్యకు పాల్పడినట్లు సాయికిరణ్ విచారణలో వెల్లడించినట్లు తెలిపారు.

**రైల్వే స్టేషన్ వద్ద అరెస్టు**

మృతుడి అన్న కొడమాటి యర్రయ్యరెడ్డి ఫిర్యాదు మేరకు కాకినాడ టూటౌన్ పోలీసుస్టేషన్‌లో క్రైం నంబర్ 135/2026 కింద బీఎన్ఎస్ సెక్షన్ 103(1) రెడ్‌విత్ 3(5) ప్రకారం కేసు నమోదు చేశారు. నిందితులు నేరం అనంతరం పరారయ్యారు. దుర్గాప్రసాద్ తన బుల్లెట్ మోటార్‌సైకిల్ (ఏపీ 05 ఐసీ 8800)ను కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్ పార్కింగ్‌లో ఉంచి అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

టూటౌన్ సీఐ మజ్జి అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఎస్సైలు సువర్ణకుమారి, ఎల్ భీష్మకుమార్, పి సత్తిబాబు, పోలీసు, క్రైమ్ సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. విశ్వసనీయ సమాచారంతో రైల్వే స్టేషన్ పార్కింగ్ వద్ద పోలీసులు మాటువేసి ఉండగా, బుధవారం సాయంత్రం బుల్లెట్‌ను తీసుకునేందుకు వచ్చిన నలుగురిని అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో బొందల సాయికిరణ్ (30), ఇంటి సత్యనారాయణ (30), ప్రయాగ దుర్గాప్రసాద్ (28), ఇంటి ఆదికృష్ణ (30) ఉన్నారు. వారి నుంచి నాలుగు సెల్‌ఫోన్లు, బుల్లెట్ మోటార్‌సైకిల్, ఘటన సమయంలో ధరించిన దుస్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను న్యాయస్థానం ముందు హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించనున్నట్లు అదనపు ఎస్పీ తెలిపారు. కేసును ఛేదించి నిందితులను అరెస్టు చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ బిందుమాధవ్ అభినందించారు.

# మైదుకూరు తాగునీటి సమస్య పరిష్కారానికి కే.సి కెనాల్ నుంచి నీటి విడుదల..

**● రైతులు తొందరపడి పంటలు సాగు చేయవద్దు**
**ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్.**



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా సెప్టెంబర్ 03: మైదుకూరు నియోజకవర్గంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ చొరవ తీసుకున్నారు. గత రెండు రోజులుగా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యేకు ప్రజలు తాగునీటి ఇబ్బందులను వివరించడంతో వెంటనే స్పందించారు. ఈ మేరకు కే.సి కెనాల్

ఉన్నతాధికారులతో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడి, కొన్ని రోజులపాటు కెనాల్‌కు నీటిని విడుదల చేస్తే నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో తాగునీటి సమస్యను అధిగమించవచ్చని వివరించారు. ఎమ్మెల్యే పుట్టా చొరవతో రేపో మాపో కేసి కెనాల్‌కు నీటిని విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు. అయితే కేసి కెనాల్ పరిధిలోని రైతులు నీరు వస్తుందనే ఉద్దేశంతో తొందరపడి పంటలు సాగు చేయవద్దని ఎమ్మెల్యే పుట్టా సూచించారు. ప్రస్తుతం విడుదల చేసే నీటిని కుంటలు, చెక్ డ్యామ్‌లను నింపుకోవడంతో పాటు తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించుకోవాలని స్పష్టం చేశారు. సాగునీరు వస్తుందని భావించి ముందస్తుగా పంటలు సాగు చేస్తే రైతులు నష్టపోయే అవకాశం ఉందని, సాగునీటి విడుదలపై అధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చే వరకు రైతులు పంటలు సాగు చేయవద్దని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని కేసి కెనాల్ నుంచి నీటి విడుదలకు చొరవ తీసుకున్న ఎమ్మెల్యే పుట్టాకు ప్రజలు, రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఎక్కడ క్షుద్ర పూజలు చేశానో నిరూపించాలి.!!

**నాపై అనవసర నిందలు మోపే వారిపై కేసు నమోదు చేయాలి. - మాజీ ఎంపీపీ అల్లే ప్రభావతి.**



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా సెప్టెంబర్ 03: నేను క్షుద్ర పూజలు చేసే మహిళనైతే, నాపై అనవసర మైన నిందలు చేసేవారు ఏదైనా సరే ఆధారాలతో నిరూపించాలని మాజీ ఎంపీపీ అల్లె ప్రభావతి డిమాండ్ చేశారు. జమ్మలమడుగు పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథి గృహం నందు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లె ప్రభావతి మాట్లాడుతూ.. తనపై వస్తున్న క్షుద్రపూజల ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నానని, తాను ఎన్నో దేవాలయాల్లోని దేవుళ్లను నమ్ముకుని జీవించానని తెలిపారు. ఆంజనేయస్వామి ఆలయానికి సంబంధించిన పాత విగ్రహం కోసం, మంచి కోసం, న్యాయం, ధర్మం కోసం వెళ్లానని ప్రభావతి తెలిపారు. దైవికంగా పాత ఆంజనేయ స్వామి విగ్రహాన్ని అడిగానే తప్ప ఎలాంటి ప్యాక్షన్ పెట్టాలని తాను కోరుకోలేదని స్పష్టం చేశారు. మీరు ఆంజనేయస్వామి ఆలయాన్ని గొప్పలు చెప్పుకోవడానికి నిర్మించారా అంటూ ప్రశ్నించారు?. తాను ఎన్నో దేవాలయాలకు దానాలు చేసినప్పటికీ వాటిని ఎప్పుడూ ప్రచారం చేసుకోలేదని గుర్తు చేశారు. ప్రస్తుతం తనపై మాట్లాడు తున్నవారు గతంలో తన సహాయం కోసం రాలేదా? నా ద్వారా లబ్ధి పొందలేదా? అని ప్రశ్నించారు. తాను హత్యలు చేసే వ్యక్తినైతే గతంలో వారికి ఎందుకు సహాయం చేస్తానని నిలదీశారు. తనకు క్షుద్రపూజలు చేసే అలవాటు ఉంటే తన సొంత గ్రామమైన దన్నవాడలో కాకుండా ఇతర గ్రామాల్లో చేసే దానినని వ్యాఖ్యానించారు. కపటంతో సంపాదించుకోవాలనే ఉద్దేశం తనకు ఉంటే వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే ఆస్తులు సంపాదించుకునేదానినన్నారు. తాను ఎప్పుడూ పదవుల కోసం పరిగెత్తలేదని, దేవుడిని నమ్ముకుని జీవించే వ్యక్తినని స్పష్టం చేశారు. తాను దేవుడికి భయపడతానని, తనపైతప్పుడు నిందలు వేసిన వారిని భగవంతుడే శిక్షిస్తాడన్నారు. ఎన్ని ఆరోపణలు వచ్చినా తాను మాత్రం సమాజ సేవను కొనసాగిస్తానని స్పష్టం చేశారు.

# రైతులకు న్యాయం జరిగే వరకూ పవర్ గ్రిడ్ కంపెనీలతో పోరాడుతా..!!

- పవర్ గ్రిడ్ టవర్ల ఏర్పాటుతో బీడు భూములుగా మారుతున్న సారవంతమైన పంట పొలాలు.
- పవర్ గ్రిడ్ కంపెనీలు రైతు పొలాలలో ఏర్పాటు చేస్తున్న 400 కెవి నుండి 800 కెవి వరకు విద్యుత్తు టవర్లను రైతులతో కలిసి పరిశీలన.
- మొన్న పెద్దముడియం మండలం.. నేడు మైలవరం మండలంలోని వేపరాల గ్రామ రైతులతో కలసి పొలాలలో ఏర్పాటు చేస్తున్న టవర్ల పరిశీలన.
- వైయస్ఆర్సీపీ జమ్మలమడుగు ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి

**కడపజిల్లా.. జమ్మలమడుగు నియోజకవర్గంలోని రైతులకు అన్యాయం చేస్తున్న పవర్ గ్రిడ్ కంపెనీల పై ప్రత్యేక స్టోరీ..**



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా సెప్టెంబర్ 03: దేశవ్యాప్తంగా లక్ష కోట్ల ఆదాయాన్ని ఆర్జిస్తున్న పవర్ గ్రిడ్జ్ కంపెనీ యాజమాన్యం కోట్లాది రూపాయలు విలువైన రైతుల పంట భూముల్లో పవర్ గ్రిడ్ టవర్లు మరియు విద్యుత్తు లైన్లు ఏర్పాటు చేసుకోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వారికి సరిపడా నష్టపరిహారం చెల్లించకుండా పవర్ గ్రిడ్జ్ యాజమాన్యం అమాయక రైతుల ప్రాణాలతో చలగాటం ఆడుతున్నారని, కడపజిల్లా, జమ్మలమడుగు వైసీపీ ఎమ్మెల్సీ రామ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. జమ్మలమడుగు నియోజకవర్గంలోని మైలవరం, పెద్దమొడియం, జమ్మలమడుగు, మండలాల్లోని ఆయా గ్రామాలలో పవర్ గ్రిడ్ కంపెనీ యాజమాన్యం సారవంతమైన పంటలు పండే పంట పొలాలలో రైతులకు ఎలాంటి నష్టపరిహారం చెల్లించకుండా, రైతుల అనుమతి లేకుండా మరియు తమ పంట పొలాల్లో టవర్ల నిర్మాణం చేపట్టవద్దని రైతులు అడ్డగిస్తున్న దౌర్జన్యంగా వారి పంట పొలాలలో పవర్ గ్రిడ్ టవర్లు మరియు విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్నారన్నారు. దీంతో ఆ పంట పొలాల్లో ఎలాంటి పంటలు సాగు చేసుకునేందుకు వీలు లేకుండా పోయిందన్నారు. అలాగే టవర్ల వేస్తున్న ప్రాంతం ప్రొహిబిటేడ్ ఏరియా క్రిందికి వస్తుందని తద్వారా ఆ ప్రాంతంలో ఎలాంటి గోడౌన్లు కానీ, ఫ్యాక్టరీలు కానీ, కోళ్ల ఫారాలుకానీ, ప్లాట్లు కానీ, ఇండ్ల నిర్మాణాలు వంటి వ్యాపార సముదాయాలు ఏర్పాటు చేసుకునేందుకు గాని ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు రావని ఎమ్మెల్సీ తెలిపారు. అలాగే కోట్ల రూపాయలు విలువ చేసే భూములలో 400 కె.వి మరియు 800 కే.వి వరకు టవర్లు ఏర్పాటు చేసి, ఐదు సెంట్ల నుండి 14 సెంట్ల వరకు పొలం టవర్ల కోసం వినియోగి స్తున్నారన్నారు. పరిహారం విషయానికొస్తే సెంటుకు 50 వేలు టవర్లకు మాత్రమే నష్టపరిహారం అందించారని, కొందరి రైతులకు అది కూడా ఇప్పటివరకు అందించకుండా వారిని మోసం చేశారని, విద్యుత్తు లైన్లకు మాత్రం అసలే పరిహారం ఇవ్వకుండా మోసం చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ మాత్రం రైతు పొలాలలో ఏర్పాటు చేస్తున్న టవర్లకు మరియు విద్యుత్ కారిడార్లకు రైతుకు నష్టపరిహారం చెల్లించమని స్పష్టంగా జీవోలు చెబుతున్నప్పటికీ వాటిని బేఖాతారు చేసి రైతులను మోసం చేస్తూ వారి పబ్బం గడుపు కుంటున్నారని పవర్ గ్రిడ్ కంపెనీల పైన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఎలాంటి అనుమతులు లేకుండా దౌర్జన్యంగా తమ పంట పొలాల్లో పవర్ గ్రిడ్ కంపెనీ యాజమాన్యం టవర్లు మరియు విద్యుత్ లైన్ ఏర్పాటు చేశారని, తమకు నష్టపరిహారం అందించేంత వరకు పోరాడుతామని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత రైతులతో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి కలిసి పంట పొలాల్లో అక్రమంగా ఏర్పాటు చేసిన విద్యుత్ టవర్లు, కారిడార్ విద్యుత్తు లైన్లను పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. పవర్ గ్రిడ్ కంపెనీ యాజమాన్యం రైతుల భూముల్లో టవర్లు, విద్యుత్తు లైన్లు నిర్మించుకొని దేశవ్యాప్తంగా లక్ష కోట్ల ఆదాయం పొందుతున్నారని, పెద్ద, పెద్ద కంపెనీలకు లాభాలు అర్జించి పెట్టడమే కాకుండా వారి వ్యాపారానికి కారణమైన రైతులకు ప్రతి సంవత్సరం వచ్చే ఆదాయంలో సంవత్సరానికి ఒకసారి గుత్త ఇచ్చినట్లు డబ్బులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం మార్కెట్లో ఎకరం పొలం 50 లక్షల నుండి కోటి రూపాయల వరకు జరుగుతుందని ఇటువంటి పరిస్థితులలో రైతులకు పవర్ గ్రిడ్ కంపెనీలు పెద్ద ఎత్తున రైతులను అమాయకులను చేసి మోసం చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ఉన్న ధరలకు పంటలు సాగు చేసుకునే భూములను మొత్తం కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అలా కాకుండా లక్షల, కోట్ల విలువ చేసే పంట పొలాల భూముల్లో టవర్లు, విద్యుత్తు లైన్లు ఏర్పాటు చేసి వారికి నష్టపరిహారం కానీ సరైన ధర ఇవ్వకపోతే రైతుల తరఫున పోరాటానికి సిద్ధంగా ఉంటానన్నారు. ఈ విషయంపై బాధిత రైతులతో కలిసి ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి జమ్మలమడుగు స్థానిక ఆర్డీవో కార్యాలయంలో గత మూడు రోజుల క్రితం ఇన్చార్జి ఆర్డీవో శిరీషను కలిసి రైతులకు జరుగుతున్న అన్యాయం గురించి తెలుపుతూ రైతుల సమక్షంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఇదే విషయంపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి జమ్మలమడుగు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో పవర్ గ్రిడ్ కంపెనీల యాజమాన్యం ఏర్పాటు చేసిన టవర్లు మరియు విద్యుత్తు లైన్లు ఏర్పాటు చేసిన పంట పొలాల రైతులకు సరైన నష్టపరిహారం ఇప్పించి వారికి న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చెరుకూరి దృష్టికి తీసుకెళ్ళాను అన్నారు. ఈ విషయం పైన సంబదిత కలెక్టర్ కూడా పూర్తిస్థాయిలో పవర్ గ్రిడ్ కంపెనీ లతో మాట్లాడి రైతులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో బాధిత పంట పొలాలు రైతులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




> మా పర్మిషన్ లేకుండానే మా వ్యవసాయ భూమిలో టవర్లు వేయడం చాలా దారుణం. ఎకరా భూమి కోటి రూపాయలు పై మాటే.. టవర్ లు నిర్మించడం వలన రైతుల భూములు బీడు అవుతాయి కానీ వ్యవసాయ క్షేత్రం అవ్వదు. రైతుల భవిష్యత్తును నాశనం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ మరియు సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం..
>
> రైతు వెంకటేష్, వేపరాల గ్రామము, మైలవరం మండలం.

## ఢిల్లీలో పెద్దలతో భట్టి భేటీ



ఢిల్లీ:: ఢిల్లీ పర్యటనలో ఉన్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కాంగ్రెస్ పార్టీకి చెందిన అగ్రనేతలను కలిశారు . పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ను గౌరవ పూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలంగా సేవలు అందిస్తున్న మల్లు భట్టి విక్రమార్కకు అనేకమంది అగ్ర నేత లతో సత్సంబంధాలు ఉన్నాయి. ఈ క్రమంలో సీనియర్ నేతలను గౌరవపూర్వకంగా కలుసుకున్నారు.


## అమరావతి స్కూల్‌లో ఘనంగా ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలు



నెల్లూరు జిల్లా పొదలకూరు (బిఎన్ఎస్):– నెల్లూరు జిల్లాలోని పొదలకూరు పట్టణంలో శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని అమరావతి స్కూల్‌లో గురువారం ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు రాధాకృష్ణుల వేషధారణలో ముచ్చటగా ముస్తాబై ఎంతో ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థుల కోలాటాలు, ఉట్టి కొట్టే కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారుల సందడి, ఉత్సాహంతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా అమరావతి స్కూల్ అధినేత శ్రీ కె. సురేష్ గారు మాట్లాడుతూ "చిన్న వయసు నుంచే పిల్లలకు మన సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల విశిష్టతను తెలియజేయడమే అమరావతి స్కూల్ ముఖ్య ఉద్దేశం. విద్యతో పాటు మన సంస్కృతిని కూడా విద్యార్థులకు పరిచయం చేయాలి" అని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషి చేసిన ఉపాధ్యాయులకు, విద్యార్థులకు మరియు తల్లిదండ్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు చిన్నారుల్లో సంప్రదాయాల పట్ల ఆసక్తిని, ఐక్యతను, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా "విద్యతో పాటు సంస్కృతి –– సంప్రదాయాలే పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాది" అని తెలిపారు.

## టీచర్స్ డే సందర్భంగా ప్రియదర్శిని బాలవిహార్ లో పిల్లలే గురువులైన వేళ...




కొత్తపేట (బిఎన్ఎస్ )సెప్టెంబర్ 03 : సెప్టెంబరు 5వ తేదీ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని రెండు రోజుల ముందుగా ఈరోజున పిల్లలు తమకు ఉపాధ్యాయ వృత్తి పట్ల గల గౌరవ మర్యాదలను సరికొత్త రీతిలో ప్రకటించారు. పిల్లలే టీచర్లుగా తమ తరగతిలోని మిగిలిన పిల్లలకు పాఠాలు బోధించారు. 5వ తేదీన జరిగే ఉపాధ్యాయుల సత్కార సభకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండాలని, రేపు కృష్ణాష్టమి సెలవు రావడం వల్ల ఈ ప్రత్యేక కార్యక్రమాన్నిఈరోజే చేసుకున్నామని వారన్నారు.

ఇలా పిల్లల చేత పాఠాలు చెప్పించే విధానం తమ స్కూలులో కొత్త కాదని, కానీ టీచర్స్ డే సందర్భంగా ఇంతమంది పాఠాలు చెబుతామంటూ ముందుకు రావడం ఇదే మొదటిసారని, ఒక పాఠాన్ని10 సార్లు చదివితే వచ్చే అవగాహన ఒకసారి ఇతరులకు చెబితే వస్తుందని ఈ నిజాన్ని పిల్లలు అర్థం చేసుకున్నారని కరస్పాండెంట్ బుద్ధ చంద్ర దేవ్ అన్నారు.

'సెనెకా' అనే విద్యావేత్త చెప్పిన "నేర్చుకోవడానికి ఉత్తమ మార్గం నేర్పించడమే" అనే సూక్తికి జీవం పోస్తూ 33 మంది పిల్లలు టీచర్లుగా తమను నిరూపించుకోవడానికి ముందుకు రావడం ఎంతో సంతోషదాయకమని స్కూలు అకడమిక్ డైరెక్టర్ అద్దంకి సాహిత్య తెలిపారు.

పిల్లలే స్వయంగా టీచర్లు గా మారడం వల్ల, వాళ్ళు పాఠాన్ని బట్టీ పట్టకుండా నేర్చుకుని వచ్చారని, టీచరుకు అప్పచెప్పడానికి కాకుండా తమ తోటి పిల్లలకు బోధించడానికి ప్రిపేర్ అవుతున్నామనే ఆలోచనతో విషయాన్ని అర్థం చేసుకుంటూ చదువుకుని వచ్చారని సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు ఆలపాటి మూర్తి అన్నారు.

ఈరోజు తమ స్కూలులో పాఠాల బోధన మాత్రమే జరగలేదని బాధ్యత, నాయకత్వం, సహానుభూతి అనే మూడు అమూల్యమైన విషయాలను పిల్లలు అర్థం చేసుకున్నారని తెలుగు టీచర్ బూసి నాని కుమారి చెప్పారు .

బ్లాక్ బోర్డు ముందు నిలబడింది నిత్యం తమకు పాఠాలు చెప్పే ఉపాధ్యాయుడు కాదు. ప్రతి నిత్యం తమతో బాటు కూర్చుని పాఠాలు వినే విద్యార్థే! అనే భావం పిల్లలందరితో బాటు టీచర్లను కూడా ఆనందపరవశులను చేసిందని బయాలజీ టీచర్ అనూష అన్నారు.

తాము బోధిస్తున్నామనే భావన పిల్లలలో చదువు పట్ల ఇష్టాన్ని పెంచడమే కాకుండా తమ భవిష్యత్తుపై ఆత్మవిశ్వాసాన్ని, నాయకత్వ లక్షణాలను కూడా పెంచతుందని మాథ్స్ టీచర్ ఇందుభార్గవి తెలిపారు.

"గురువు అద్దం లాంటి వాడు కాదని , దీపం లాంటి వాడని, అద్దం మనల్ని మనకు చూపిస్తుందని, దీపం అందరికీ దారిని చూపిస్తుందని" చెప్పలేదని, గురువు స్థానం ఎంత బరువైనదో, ఎంత బాధ్యతాయుతమైనదో తెలుసుకున్నారని, ఒక పాఠం చెప్పడం కోసం టీచర్ ఎంత ఓపికగా, ప్రేమగా సిద్ధపడతారో అర్థం చేసుకున్నారానీ, నిజమైన ఉపాధ్యాయులం ఈరోజు వెనుక బెంచీలో కూర్చుని గర్వంతో ఉప్పొంగే తల్లిదండ్రుల్లా పిల్లలు పాఠాలు చెప్పే దృశ్యాన్నిచూసి మురిసిపోయామని అన్నారు. "బోధించడం అంటే జ్ఞానాన్ని నింపడం కాదు, అగ్నిని రగిలించడం" అని విలియం బట్లర్ యేట్స్ అన్నట్లు, ఈ పిల్లలు ఈరోజు తోటి పిల్లల్లో నేర్చుకోవాలనే జ్వాలను రగిలించారన్నది వాస్తవం. ఇప్పుడు పాఠాలు చెప్పిన వీళ్ళంతా చిన్నప్పుడు ప్రీప్రైమరీ చదువుకున్నప్పుడు స్కూలయ్యి ఇంటికి వెళ్ళాక తల్లిదండ్రులకు, ఇంట్లో ఉండేవారికీ, ఇరుగుపొరుగువారికి తామే టీచర్లుగా బెత్తం పట్టుకుని అనేక ప్రదర్శనలిచ్చిన వాళ్ళే అయి ఉంటారు.

సబ్జెక్టుల వారీగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను నిర్ణయించడం కేవలం జడ్జ్మెంటు కోసం మాత్రమే. ఎవరినీ నిరుత్సాహపరచడానికి కాదు. ఎవరు ఎంచుకున్న పాఠాలను ఎవరి పరిధిలో వారు చాలా బాగా చెప్పారన్నది నిజమని, అందరికీ అభినందనలని కరస్పాండెంట్ బుద్ధ చంద్ర దేవ్ అన్నారు.

## పి.గన్నవరం నియోజకవర్గంలో సీఎం పర్యటనకు సన్నాహాలు..

**సీఎం సభా ప్రాంగణం, హెలిప్యాడ్‌కు స్థల పరిశీలన..**



పి.గన్నవరం,(బిఎన్ఎస్) సెప్టెంబరు 3: పి.గన్నవరం నియోజకవర్గంలో ఈనెల 9న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన దాదాపు ఖరారైన నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లపై దృష్టి సారించారు. పర్యటనలో భాగంగా సభా ప్రాంగణం, హెలిప్యాడ్ ఏర్పాటుకు అనువైన ప్రాంతాలను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా గురువారం పరిశీలించారు. సంబంధిత శాఖల అధికారులు కూడా స్థల పరిశీలనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ సీఎం పర్యటనకు సంబంధించి సభా ప్రాంగణం, హెలిప్యాడ్ తదితర ఏర్పాట్ల కోసం పలు ప్రాంతాలను పరిశీలించినట్లు తెలిపారు. తుది స్థల నిర్ణయం అనంతరం పర్యటనకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడిస్తామన్నారు. ముఖ్యమంత్రి పర్యటనను ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేసేందుకు కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు.

## గెద్దాడ 216 జాతీయ రహదారిపై జిల్లా రవాణా అధికారి తనిఖీలు

**10 వాహనాలపై కేసులు.. రూ.30 వేల జరిమానా**



216 జాతీయ రహదారిపై గడ్డర్లను పరిశీలిస్తున్న డీ.టీ.ఓ

గెద్దాడ: (బిఎన్ఎస్ )సెప్టెంబర్ 03: 216 జాతీయ రహదారిపై జిల్లా రవాణా అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు గురువారం ఉదయం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. జాతీయ రహదారిపై అనధికారికంగా వాహనాలను నిలిపి ఉంచడం, రహదారి భద్రతా నిబంధనలు ఉల్లంఘించిన 10 వాహనాలపై కేసులు నమోదు చేసి మొత్తం రూ.30,000 జరిమానా విధించినట్లు డీటీఓ తెలిపారు.

మామిడికుదురు, భట్నవిల్లి వై జంక్షన్ సమీపంలో జాతీయ రహదారిపై నిలిపి ఉంచిన వాహనాలపై జరిమానాలు విధించడంతో పాటు, వాటిని అక్కడి నుంచి తొలగించారు.

ఈ సందర్భంగా డీటీఓ దేవిశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ 216 జాతీయ రహదారిపై వాహన తనిఖీలను తరచూ నిర్వహిస్తామని తెలిపారు. రహదారి భద్రతా నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జాతీయ రహదారిపై వాహనాలను నిలిపి ఉంచడం వల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు గస్తీని ముమ్మరం చేయడంతో పాటు పోలీస్, రవాణా శాఖ, ఎన్‌హెచ్ఏఐ ఆధ్వర్యంలో సంయుక్త కార్యాచరణ రూపొందిస్తున్నట్లు డీటీఓ వెల్లడించారు.

అదేవిధంగా రహదారి భద్రతలో భాగంగా 216 జాతీయ రహదారిపై హైటెన్షన్ విద్యుత్ వైర్లు ఉన్న ప్రాంతాల్లో భారీ లోడుతో వాహనాలు వెళ్లకుండా ఏర్పాటు చేసిన గడ్డర్లు, ప్రమాద హెచ్చరిక బోర్డులను డీటీఓ పరిశీలించారు.

ఈ తనిఖీల్లో సహాయ మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ కుడుపూడి వరప్రసాద్ పాల్గొన్నారు.

## టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ అరెస్ట్..



సూర్యాపేట,బిఎన్ఎస్: సూర్యాపేట టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సోమయ్యను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలు, ఫిర్యాదుల నేపథ్యంలో ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆయన ఇళ్లలో గురువారం సోదాలు చేపట్టారు. సోమయ్య కార్యాలయంతో పాటు బంధువులు, అనుచరులకు చెందిన 7 ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. సోదాల్లో భారీగా ఆస్తుల డాక్యుమెంట్లు, నగదు, బంగారం, వెండి స్వాధీనం చేసుకున్నారు.

సోమయ్యకు చెందిన 3 ఎకరాల 3 గుంటల వ్యవసాయ భూమి, సూర్యాపేట, హయత్‌నగర్ పరిధిలో 5 రెసిడెన్షియల్ ప్రాపర్టీలను గుర్తించారు. వీటిలో జీ౦1, జీ౦2, జీ౦4౦పెంట్‌హౌస్ భవనాలతో పాటు రెండు గ్రౌండ్‌ఫ్లోర్ ఇళ్లు ఉన్నాయి. 8 ఓపెన్ ప్లాట్లు, రూ.4.63 లక్షల నగదు, బ్యాంకు ఖాతాల్లో రూ.13 లక్షల బ్యాలెన్స్, 709 గ్రాముల బంగారం, 1,750 గ్రాముల వెండి, రెండు కార్లు, మూడు ద్విచక్ర వాహనాలు, ఇంట్లో రూ.11 లక్షల విలువైన గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, బ్యాంకులో 66 తులాల బంగారం తాకట్టు పెట్టి రూ.49 లక్షల గోల్డ్ లోన్ ఉన్నట్లు గుర్తించారు. ఏసీబీ లెక్కల ప్రకారం మొత్తం ఆస్తుల విలువ రూ.3,54,36,490 అని తేల్చారు. బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ భారీగా ఉండొచ్చని అధికారులు అంచనా వేశారు. సోమయ్య ఆస్తులపై ఏసీబీ మరింత లోతుగా విచారణ కొనసాగిస్తోంది. నిందితుడిని హైదరాబాద్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నారు.